క్లుప్తంగా

పేదలను ఆదుకోవాలి

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



ఎంపీ రంజిత్‌రెడ్డితో తంగడపల్లి గ్రామస్తులు

మొయినాబాద్/చేవెళ్ల: ప్రతిఒక్కరూ పేదలను ఆదుకోవాలని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ఆసుపత్రిలో బిల్లు చెల్లించలేని స్థితిలో ఉన్న వ్యక్తికి ఆయన ఆర్థిక సహాయం అందజేశారు. చేవెళ్ల మండలం తంగడపల్లి గ్రామానికి చెందిన పూలపల్లి వంశీగౌడ్ కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఓ ఆసుపత్రిలో చేరాడు. విషయం తెలుసుకున్న ఎంపీ అతని కుటుంబ సభ్యులకు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం వంశీగౌడ్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఓటరు జాబితాలో తప్పులు సరిచేసుకోండి

కొందుర్గు: ఓటరు జాబితాలో ఏమైన తప్పులు ఉంటే సరి చేసుకోవాలని తహసీల్దార్ రమేష్ కుమార్ సూచించారు. శనివారం కొందుర్గు మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు సంబంధించి 26 పోలింగ్ బూత్‌ల ఓటరు జాబితాను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణయ్య, ఆర్‌ఐ శివ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందికర చట్టాలను ఉపసంహరించుకోవాలి

శంకర్‌పల్లి డీసీఎం డ్రైవర్స్ అసోసియేషన్



ర్యాలీలో డీసీఎం డ్రైవర్లు

శంకర్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన చట్టాన్ని విరమించుకోవాలని శంకర్‌పల్లి డీసీఎం డ్రైవర్స్ అసోసియేషన్ శనివారం పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మోటార్ వాహనా చట్టాన్ని వెంటనే ఉప సంవహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే దేశ వ్యాప్తంగా ఎక్కడి వాహనాలను అక్కడే నిలిపి వేసి నిరసనను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి మణికొండ మధుసూదన్ రెడ్డి, సభ్యులు రమేష్, జహంగీర్, రాఘవేంద ర్‌రెడ్డి, రాజుగౌడ్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి

ఎంపీడీఓ వినయ్‌కుమార్

షాద్‌నగర్: ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఈ నెల 6 నుంచే ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ ప్రారంభించినట్లు ఎంపీడీఓ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. మొత్తం దరఖాస్తులను శుక్రవారం సాయంత్రం వరకు ఆన్‌లైన్ నమోదు చేసి పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ కోసం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంతో పాటు, ఫరూఖ్‌నగర్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కంప్యూటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీని కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించి ఆన్‌లైన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. చాలా మంది మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాల కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు ఆయన వివరించారు.

చేవెళ్లలో ముగ్గుల పోటీలు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ మహిళా నేతలు

మొయినాబాద్/చేవెళ్ల: సంక్రాంతి సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేవెళ్లలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి భీంభరత్ సతీమణి జ్యోతి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. అనంతరం బ్రహ్మకుమారీస్ క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల సర్పంచ్ శైలజా ఆగిరెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు దేవర సమతా వెంకట్‌రెడ్డి, గోనె సరితా ప్రతాప్‌రెడ్డి, బ్రహ్మకుమారీస్ మండల ఇన్‌చార్జి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి.. ధరల పోటు!



- ఇబ్బందుల్లో జనం
- భగ్గుమంటున్న నిత్యావసరాలు

షాబాద్: మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. సాధారణ రోజుల్లో పరిస్థితి ఇలా ఉంటే ఇక పండుగ సందర్భాల్లో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దీంతో పేదలు ఈ ధరల పెరుగుదలను చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏమి తినాలి.. ఏమి కొనాలి.. అంటూ తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. సాధారణరోజుల్లో పరిస్థితి ఒకవిధంగా ఉంటే పండుగ రోజుల్లో ధరలు రెండింతలవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు సంక్రాంతి జరుపుకోవాలంటే నిత్యవసర సరుకుల ధరల పోటు వారికి ఇబ్బందిగా తయారైంది. పెరుగుతున్న ధరలను తగ్గించే వారు కరువయ్యారు. ఇలాంటి సందర్భాల్లో ప్రభుత్వాలు ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. నిత్యావసరాలైన చింతపండు, ఉల్లిగడ్డ, ఉప్పుతో పాటు కూరగాయల రేట్లు విపరీతంగా పెరిగాయి. ఈ వస్తువులను సామాన్యుడు పండుగ పూట కొనాలంటే వారు ఇబ్బందులకు గురవుతున్నట్లు చెబుతున్నారు. నిత్యావసర సరుకులైన కిలో మంచి నూనె మార్కెట్‌లో రూ. 95 నుంచి 120లకు అమ్ముతున్నారు. శనగ పిండి కిలో రూ.90 నుంచి 95లకు, పెసరపప్పు రూ. 110 నుంచి 120లకు, కందిపప్పు రూ.150 నుంచి160లకు, మినపపప్పు రూ.130నుంచి 135లకు పెరిగింది. చింతపండు రూ.110 నుంచి 130గా ఉంది. ఉప్పు, ఉల్లిపాయలు, బియ్యం, పప్పులు, ఎండుమిర్చితో పాటు కూరగాయల ధరలు కూడా మార్కెట్లో రెండింతలుగా ఉంది. సంక్రాంతి వస్తుందంటే వారం రోజుల ముందే సందడి మొదలవుతుంది. కానీ ఈ సంవత్సరం పండుగకు బంధువులను ఇంటికి పిలవాలంటేనే పేదోడు జంక్కాల్సిన పరిస్థితులు దాపురించాయి. హిందూ సంప్రదాయం ప్రకారం ఆడపడుచులను పుట్టింటికి తీసుకరావడం ఆనవాయితీ. బంధు మిత్రులందరూ సొంత గ్రామాలకు చేరుకొని ఆనందోత్సావాలతో పండుగను జరుపుకుంటారు. కానీ ఈ సారి పండగ వాతావరణం అంతంతగానే కనిపిస్తుంది. పండుగకు కొద్ది రోజుల ముందు నుంచే గ్రామాల్లో ఆటల పోటీలు, పిండి వంటకాలతో సంబరాలు జరుపుకునేవారు. అయితే ఈ సారి పెద్దగా ఎవరు కూడా ఆసక్తి కనబరచడం లేదు. దీంతో వందలాది పేద కుటుంబాలు కనీసం సంక్రాంతి రోజైనా సంతోషంగా గడుపుదామనుకున్నా అందుకు పరిస్థితులు అనుకూలంగా లేవని వారు విచారం వ్యక్తం చేస్తున్నారు.



షాద్‌నగర్: బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

పండుగలు సంస్కృతికి ప్రతీక

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పండుగలు సంస్కృతికి ప్రతీకలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ హిందువుల పండుగల్లో అత్యంత ముఖ్యమైనది సంక్రాంతి అని అన్నారు. రైతులకు ఎంతో ఆనందాన్నిచ్చే పండగ అని అన్నారు. మహిళలు ఇళ్ల ముందు ముత్యాల ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టి పూజించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. సంస్కృతి సంప్రదాయాలు ఉట్టి పడేలా ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తు తరాల వారికి ఎంతో ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బాబర్‌ఖాన్, చెంది తిరుపతి రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, అగ్గనూరు బస్వం, రఘునాయక్, దాసకృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలన

పట్టణ శివారులో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో నిర్మిస్తున్న బ్లాక్‌ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలన్నారు. సకాలంలో నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆయన సూచించారు.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు తప్పవు

ఎస్‌ఐ వీరబ్రహ్మం



చేవెళ్లలో పతంగుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

మొయినాబాద్/చేవెళ్ల: పతంగుల దుకాణాల్లో చైనా మాంజా విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ వీరబ్రహ్మం పేర్కొన్నారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పతంగుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఎంకేపల్లి గ్రామంలోని ఓ షాపులో చైనా మాంజా విక్రయిస్తున్న యజమానిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైనా మాంజాలతో ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. పతంగులు ఎగురవేసేటప్పుడు చైనా మాంజాతో చిన్న పిల్లల చేతులు కోసుకపోతున్నాయని, పక్షులు, జంతువులకు ఈ మాంజాతో ప్రమాదాలు ఎదురవుతున్నాయన్నారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వీరబ్రహ్మం హెచ్చరించారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన వేంకటేశ్వర స్వామి దేవాలయం

కొందుర్గు: మండలంలోని సంజీవపురం చింతల్‌లో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలకు దేవాలయాన్ని ముస్తాబు చేశారు. ప్రతి ఏటా సంక్రాంతి సందర్భంగా ఈ దేవాలయంలో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. ఈ దేవాలయం మండలంలోని విశ్వనాథ్‌పూర్, వెంకిర్యాల, లక్ష్మిదేవిపల్లి సమీపంలో ఉండటం వల్ల మూడు గ్రామాల ప్రజలు ఈ ఉత్సవాల నిర్వహణలో పాల్గొంటారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ, ఫరూఖ్‌నగర్ మండలాలతోపాటు మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట, చౌడాపూర్ మండలాలకు చెందిన భక్తులు కూడా పెద్ద ఎత్తున హాజరవుతారని దేవాలయ కమిటీ చైర్మన్ రామకృష్ణ తెలిపారు. 15న ధ్వజారోహనం, గణపతి హోమం, శకటోత్సవం, రాత్రికి భజనలు, 16న స్వామివారి అభిషేకం, 17న రథోత్సవం, పల్లకీసేవ అలాగే దేవాలయ ఆవరణలో వెలసిన మైసమ్మ దేవతకు బండ్లు, బోనాల కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. 18న స్వామివారి కళ్యాణం, భజనలు, అన్నదానం నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎంపీ మన్నే శ్రీనివాసురెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, ప్రతాప్‌రెడ్డి, బక్కని నర్సింలు వివిధ పార్టీల ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

టీఎస్‌ఎస్‌ఓ మండల అధ్యక్షుడిగా రేవంత్‌గౌడ్



నియామక పత్రం అందుకున్న రేవంత్‌గౌడ్

కడ్తాల్: తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్(టీఎస్‌ఎస్‌ఓ) కడ్తాల్ మండల అధ్యక్షుడిగా మండలంలోని చరికొండకు చెందిన పాలకూర్ల రేవంత్‌గౌడ్ ఎన్నుకున్నారు. ఈ మేరకు శనివారం టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో, టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్‌గౌడ్ మాట్లాడుతూ.. టీఎస్‌ఎస్‌ఓ ఆర్గనైజేషన్ గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. టీఎస్‌ఎస్‌ఓ మండల అధ్యక్షుడిగా విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో టీఎస్‌ఎస్‌ఓ మండల అధ్యక్షుడిగా తనను నియమించినందుకు, టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్‌కు, కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పతంగుల సందడి..



మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్‌లో



మొయినాబాద్: సింహం చిత్రపటంతో..

సంక్రాంతి సందర్భంగా నగరంలో పతంగుల సందడి మొదలైంది. గాలిపటాలు విక్రయించేందుకు అక్కడక్కడ ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. పిల్ల, పెద్దలను ఆకర్షించేందుకు రకారకాల పతంగులను అమ్మకందారులు సిద్ధంగా ఉంచారు. పులి బొమ్మ, గద్ద, విమానం, రాందేవ్ బాబా, నరేంద్రమోదీ చిత్రపటాలతో తయారు చేసిన పతంగులు చూపరులను ఆకర్షిస్తున్నాయి.

- సాక్షి నెట్‌వర్క్



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో గాలిపటాలు ఎగురవేస్తున్న చిన్నారులు



మొయినాబాద్: విమానం ఆకారంలో

ఎగిసి పడుతున్న దుమ్ముతో రాకపోకలకు ఆటంకం

- ఇబ్బందులకు గురవుతున్న పాదచారులు
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు

కొత్తూరు: కొత్తూరు పట్టణంలోని పాత జాతీయ రహదారిపై వాహనాల రాకపోకల కారణంగా ఎగిసిపడుతున్న దుమ్ముతో పాదచారులు, స్థానిక వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలని వారు శనివారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో రోడ్డు మరమ్మతుల నిమిత్తం రోడ్డుపై మట్టిని పోసి గుంతలను చదును చేసినట్లు తెలిపారు. దీంతో ఈ రోడ్డుపై నుంచి భారీ వాహనాల రాకపోకలతో విపరీతమైన దుమ్ము వెలువడుతుందని వారు చెబుతున్నారు. ఈ విషయంలో ఆర్‌అండ్‌బీ అధికారులు, స్థానిక నాయకులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

విజయానికి ప్రతీక సంక్రాంతి

అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి

మొయినాబాద్: సంక్రాంతి పండుగ సంతోషం, విజయానికి ప్రతీక అని అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ లోకసాని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలోని అరిస్టాటిల్ పీజీ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థినులకు ముగ్గులపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్వేత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్ లింగబలిజ అధ్యక్షుడిగా అనిల్‌కుమార్



కడ్తాల్: వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండలానికి చెందిన మిర్యాణం అనిల్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం కేంద్రంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో, సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు, వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం రాష్ట్ర, జిల్లా, వివిధ మండలాల సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తానని, సమస్యలు, హక్కులపై పోరాడుతానని పేర్కొన్నారు. నియమనిబంధనలకు లోబడి, వీరశైవ లింగాయత్ లింగబలిజ సమాజ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఇంటింటికీ అక్షితల పంపిణీ



అక్షితలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సంధ్య, ఎంపీటీసీ వనిత వెంకటేశ్

షాబాద్: ఇంటింటికీ అయొధ్య రాముని అక్షితలు స్వీకరించి శ్రీరాముడిని స్ఫూర్తిగా తీసుకోవాలని కుర్వగూడ సర్పంచ్ సంధ్య మల్లిఖార్జున్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం కుర్వగూడ గ్రామంలో ఇంటింటికీ అక్షితలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హనుమాన్ దేవాలయం నుంచి భక్తులు ఊరేగింపుగా శోభాయాత్ర నిర్వహించారు.

మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆనాడు శ్రీరాముడు ధర్మపోరాటం చేసి విజయం సాధించారని గుర్తు చేశారు. నిజజీవితంలో శ్రీరాముడిని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వనిత వెంకటేష్, మహేష్, రవీయాదవ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: అయోధ్యలో రామమందిర ప్రాణ ప్రతిష్ఠ పురస్కరించుకుని శనివారం మండల పరిధిలోని సురంగల్‌లో అయోధ్య శ్రీరాముని అక్షితలను ఇంటింటికీ అందజేశారు. గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో అక్షితలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు వెంకట్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, భాస్కరాచారి, సీతారాంరెడ్డి, మల్లేష్, గౌతంరెడ్డి, ప్రభుయాదవ్, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల పోల్స్ బిగింపు



తలకొండపల్లి: మండల కేంద్రంలో శనివారం హైమాస్టు లైట్ల 4 స్తంభాలను బిగించారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న నిధులు రూ. 8 లక్షలతో 4 పోల్స్‌ను బిగించినట్లు సర్పంచ్ లలితాజ్యోతయ్య, ఉప సర్పంచ్ అనిల్‌లు తెలిపారు. బస్టాండ్, వివేకానంద విగ్రహం, కమాన్, తదితర ప్రదేశాల్లో బిగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, జ్యోతయ్య, లక్ష్మన్ నాయక్, ఉప సర్పంచ్ అనిల్, ఎంపీటీసీ హేమరాజు, వార్డు సభ్యులు ఈశ్వర్, శ్రీను, వెంకటయ్య, సజ్జుపాషా, యాదయ్య, రవి, సింగివిండో డైరెక్టర్ పాండునాయక్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాసోత్సవాలు



పూజలో సర్పంచ్, భక్తులు

తలకొండపల్లి: మండలంలోని దేవుని పడకల్ శ్రీవెంకటేశ్వర ఆలయంలో శనివారం ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేకువ జామున నుంచే అర్చకులు పూజా కార్యక్రమాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. భక్తులు ముడుపులు చెల్లించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం గోదాదేవి కల్యాణం జరుపుతున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీశైలం, అర్చకులు రామాచారి, పద్మనాభం, ఆలయ క్లర్క్ ఆంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

17న మండల సర్వసభ్య సమావేశం

కడ్తాల్: ఈ నెల 17వ తేదీ బుధవారం కడ్తాల్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సర్వసభ్య సమావేశానికి మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధశాఖల అధికారులు పూర్తి సమాచారంతో సకాలంలో సభకు హాజరుకావాలని కోరారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కొందుర్గులో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కేశంపేట: క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

కొందుర్గు: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం కొందుర్గు మండల కేంద్రంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్స్ యూత్ అసోషియేషన్ సభ్యులు గత పదారేళ్లుగా కొందుర్గులో రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ టోర్నమెంట్లతో క్రీడాకారులు రాణించే అవకాశం ఉందన్నారు. యువతకు క్రీడలపై ఆసక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, కావలి యాదయ్య, రామయ్య గౌడ్ పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: క్రీడాలతో మానసిక ఉల్లసంతో పాటు శారీరకంగా ధృడంగా ఉండొచ్చని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి సందర్భంగా శనివారం మండల పరిధిలోని అల్వాల, పుట్టోనిగూడ, మంగళిగూడ గ్రామాల్లో నిర్వాహకులు క్రికెట్ పోటీలను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా క్రికెట్ పోటీలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ యువత క్రీడాల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ వీరేష్, అల్వాల ఎంపీటీసీ సురేష్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, కేశంపేట మాజీ సర్పంచ్ యెన్నం శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించాలని కొత్తూరు మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. పెంజర్ల గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన పెంజర్ల ప్రీమియర్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆయా ప్రాంతాలకు చెందిన వ్యక్తుల మధ్య స్నేహభావం పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులు, యువత తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో మరింత నైపుణ్యం సాధించి రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యుగేందర్‌రెడ్డి, రమేశ్, సుధాకర్, జంగయ్య, ప్రవీణ్‌సూర్య, శంకర్, తదితరులు పాల్గొన్నారు.